సాక్షి
జనగామ
శుక్రవారం । 29 । మార్చి । 2024



నమాజ్.. ఆరోగ్యప్రదాయిని

రంజాన్ మాసంలో నమాజ్, ప్రార్థనలతో పాప పరిహారం, అల్లాదీవెనలు అందుతాయని ముస్లింల నమ్మకం. నమాజ్‌తో శరీర భాగాలు వ్యాయామం చేసినట్లే. - 10లో



మూణ్నాళ్ల ముచ్చటే!

మైనార్టీ తీరని వయసులోనే ప్రేమ అనే బంధానికి ఆకర్షితులై ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. 10లో

గరిష్టం/కనిష్టం
39.3°/27.4°

వాతావరణం

జిల్లాలో మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. గాలులు వీస్తాయి. రాత్రి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. కాస్త చలిగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:34	శని 4:50

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

తుపాకులు అప్పగించండి: సీపీ



వరంగల్ క్రైం: ప్రభుత్వ అనుమతులు కలిగి ఉన్న తుపాకులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ పరిధి వ్యక్తులు, ప్రైవేట్ సంస్థలను ఆదేశించారు. కమిషనరేట్ పరిధి మొత్తం 201 అనుమతి ఉన్న తుపాకులున్నాయని, ఇందులో హనుమకొండ జిల్లాలో 131, వరంగల్‌లో 52, జనగామలో 18 ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం తిరిగి అందజేయనున్నట్లు తెలిపారు. జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్నవారికి మినహాయింపు ఉంటుందని వెల్లడించారు. ఈఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు సీపీ హెచ్చరించారు.

ఏసీపీ దామోదర్ డీజీపీకి అటాచ్



జనగామ రూరల్: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో జనగామ మండల పరిధిలోని పెంబర్తి గ్రామంలో ఈ నెల 23న కాంగ్రెస్ నాయకులతో కలిసి ఏసీపీ దామోదర్ రెడ్డి చలివేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో ఎన్నికల కమిషన్ ఆయనను డీజీపీకి అటాచ్ చేశారు. చలివేంద్రం ప్రారంభంతో ఏసీపీ ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడినట్టు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వరంగల్ కమిషనర్ ఆదేశాల మేరకు జనగామ డీసీపీ పి.సీతారం సమగ్ర విచారణ జరిపి నివేదికను సీపీకి సమర్పించారు. ఆ నివేదికను సీపీ ఎన్నికల కమిషన్‌కు అందించగా నివేదిక ఆధారంగా ఆయనను జనగామ నుంచి డీజీపీకి అటాచ్ చేశారు. ఈ విషయం జనగామలో చర్చనీయాంశంగా మారింది. కాగా బదిలీ అయిన ఏసీపీకి పోస్టింగ్ ఇవ్వవకపోవడం గమనార్హం.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు సింధు ఎంపిక



రఘునాథపల్లి: సూర్యాపేట జిల్లా చింతలపల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో మండల పరిధిలోని కుర్చపల్లి గ్రామానికి చెందిన తోకల సింధు అత్యంత ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ వై.కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, ప్రధాన కార్యదర్శి తోటకూరి గట్టయ్య, సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు, అఫీసియల్స్ కుమార్, సుధాకర్, మహేష్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల30 నుంచి ఏప్రిల్ 2వరకు జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో సింధు పాల్గొంటుందని పేర్కొన్నారు. కాగా జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సింధును గ్రామస్తులు అభినందించారు.

కాషాయజెండా ఎగరడం ఖాయం



దేవరుప్పుల: ఓరుగల్లు గడ్డపై ఈసారి కాషాయం జెండా ఎగరడం ఖాయని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ఓట్ల కోసం ఉచిత పథకాలు ప్రవేశపెట్టి ఓట్లు దండుకోవడమే తప్ప శాశ్వత ప్రాతిపదికన పాలనకు చరమగీతం పాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే రూ.2 లక్షల పంట రుణమాఫీ విస్మరించిందని తెలిపారు. రైతుల పొలాలకు నీళ్లు అందిచక పంట పొలాలు ఎండి పోతుంటే కనీసం రైతులను పట్టించుకునే నాథుడే లేరన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడిగితే రైతులే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

గమ్మత్తు!

- జిల్లా కేంద్రంగా గంజాయి రవాణా
- రైలు, ద్విచక్ర వాహనాలపై సరఫరా
- విద్యార్థులు, యువత టార్గెట్
- అడ్డాగా మారిన శివారు ప్రాంతాలు
- తగ్గిన పోలీస్ పెట్రోలింగ్



జనగామ: గంజాయి రవాణాలో పోలీసులకు అనుమానం రాకుండా కొత్త పుంతలు తొక్కుతున్నారు. కిలోల కొద్ది గంజాయి ప్యాకెట్లకు స్వస్తి పలికిన ఏజెంట్లు.. చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. సోంపు ప్యాకెట్ సైజులో ఉన్న గంజాయి ప్యాకెట్లతో పాటు సిగరేట్ రూపంలో యువత, విద్యార్థులను టార్గెట్ చేసి అమ్మకాలు చేస్తున్నారు. జనగామ జిల్లా కేంద్రంలో రోజురోజుకూ పెరుగుతున్న గంజాయి అమ్మకాలతో ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. పోలీసు పెట్రోలింగ్, క్రైం పార్టీ ఇతర అధికారుల నిఘా తగ్గిపోవడంతో గంజాయి అమ్మకాలు చేసే వారి సంఖ్య పెరుగుతోంది. దీంతో రేపటి తరానికి దిక్సూచిగా నిలవాల్సిన యువత చెడు వ్యసనాలకు బానిసలుగా మారిపోతున్నారు.

రైలు, ద్విచక్ర వాహనాలే..

జాతీయ, రాష్ట్ర రహదారులపై గంజాయి సరఫరా చేసే మాఫియా.. కొత్త రూట్‌ను ఎంచుకున్నారు. తరచూ పోలీసులకు పట్టుబడుతూ జైలు పాలవుతున్న ఏజెంట్లు.. రైలు మార్గంతో పాటు ద్విచక్ర వాహనాలపై గంజాయి ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. రైలు ఎక్కిన తర్వాత ఎవరికి అనుమానం రాకుండా, గంజాయి బ్యాగును ఓ మూలన పడేసి, స్టేజీ వచ్చిన తర్వాత దిగిపోతున్నారు. రోడ్డు మార్గంలో పట్టుబడిన విధంగా గంజాయి, ఇప్పుడు దొరకడం లేదు. ఎక్కువగా హైదరాబాద్ దూల్‌పేటతో పాటు మహారాష్ట్ర, ఏపీ నుంచి తరలిస్తున్నట్లు సమాచారం.

నిషా ఎక్కించే సిగిరెట్లు

జిల్లా కేంద్రంగా గంజాయి, డ్రగ్స్ అమ్మకాలను జోరుగా సాగిస్తున్నట్లు సమాచారం. 10 గ్రాముల గంజాయి ఆకులతో ప్యాక్ తయారు చేసి, ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో పాటు యువతను టార్గెట్ చేస్తూ రిటైలర్ల ద్వారా అమ్ముతున్నట్లు చర్చ జరుగుతుంది. యువతను గంజాయి మత్తుకు బానిసలుగా మార్చేస్తున్నారు. జిల్లా కేంద్రం చుట్టూ సిద్దిపేట, సూర్యాపేట, వరంగల్, హైదరాబాద్ శివార్లతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సుమారు రాత్రి 7నుంచి 10 గంటల వరకు గంజాయి పీల్చే వారితో ప్రమాదం పొంచి ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రిటేయిలర్లకు పెద్ద ఎత్తున కమీషన్ల ఆశ చూపెడుతూ గంజాయి ప్యాకెట్లు, సిగరెట్ల రూపంలో అమ్మకాలు చేస్తున్నారు. దీనికి అలవాటు పడిన వ్యక్తులు మత్తు దొరకని సమయంలో విచక్షణ కోల్పోయి ఎదుటివారిపై దాడి చేసే ప్రమాదం లేకపోలేదు.

దర్జాగా అమ్మకాలు..

పట్టణంలో విదేశీ సిగరెట్లతో పాటు హుక్కా అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. మత్తుకు అలవాటు పడిన విద్యార్థులు డబ్బుల కోసం తల్లిదండ్రులను బ్లాక్ మెయిల్ చేసిన సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. జిల్లా కేంద్రంలో గంజాయి అమ్మకాలపై పోలీసుల నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు రూట్‌పై నిఘా..



గంజాయి అమ్మకాలపై నిఘా పెంచాం. గంజాయి స్మగ్లర్లు ద్విచక్ర వాహనాలు, రైలు రూట్‌లో సరఫరా చేస్తున్నారు. దీనిపై నిఘా పెంచడంతో పాటు గంజాయి రవాణా చేసే వారిని పట్టుకున్నాం. అమ్మకాలు చేస్తూ పట్టుబడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. గంజాయి ఎక్కడి నుంచి వస్తుందనే సమాచారం కూపీ లాగుతూ, అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

పి.సీతారాం, డీసీపీ, జనగామ

వైద్యులు సమయపాలన పాటించాలి





ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

- డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్: వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన గురువారం సందర్శించి వార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆరోగ్య మహిళా ప్రోగ్రాం, పేషెంట్లు, ప్రసూతి వసతుల గురించి తెలుసుకున్నారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, డెలివరీల వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పేషెంట్లతో ఓపికగా మాట్లాడాలని ప్రధానంగా గర్భిణులు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు జనార్దన్, సంధ్య, ప్రసన్నకృష్ణ, రజిని, వీరాంజనేయులు, సీహెచ్‌ఓ సాంబయ్య, హెచ్‌ఈ ప్రభాకర్, కె.హరిప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక ఆస్పత్రి తనిఖీ

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ హరీశ్‌రాజ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని రికార్డులు, రోగుల సంఖ్య, వసతులు తదితర వివరాలపై ఆరా తీశారు. వీటితో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్య సేవల విషయంలో ఆస్పత్రికి వచ్చే రోగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రిలో సాధరణ ప్రసవాలతో పాటు ఆపరేషన్లు కూడా నిర్వహించాలన్నారు. విధుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు విష్ణు, రజిని, శశికళతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో కఠినంగా వ్యవహరిస్తే చర్యలు

- అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీపా

జనగామ రూరల్: పిల్లలతో ఎవరైన కఠినంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సందీపా అన్నారు. పట్టణంలోని బాల సదనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ అవేర్‌నెస్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాలికలను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. అందుతున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. బాల సదనంలో ఉన్న కిచెన్, బాలికల వసతి రూంలు, భోజనం, సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు సమస్యలు ఎదురైతే వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వివరాలు తెలుపాలన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు బిస్కెట్స్ , ఐస్‌క్రీంలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విరోనిక, డిఫెన్స్ కౌన్సిల్ రవీంద్ర, జ్యోత్స్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి సందీపా

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాల్‌లో పార్లమెంటు ఎన్నికల నిర్వహణపై నోడల్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ఓటర్లలో మరింత అవగాహన కల్పించేలా స్వీప్ కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యా సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, ఫ్లెక్సీల ఏర్పాటు చేసి మాక్ పార్లమెంట్ పోలింగ్ విధా నంతో యువతను భాగస్వామ్యులను చేయాలన్నారు. మహిళల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు రంగోలీ, క్విజ్, 5కె రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తని ఖీలు చేపట్టాలని కోరారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వివిధ కేసుల్లో ఐదు ఎఫ్‌ఐఆర్‌ల నమోదు, తరిగొప్పుల వద్ద రూ.2 లక్షలు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

జనగామ రూరల్: విధుల పట్ల అంకిత భావంతో పనిచేస్తేనే తగిన గుర్తింపు వస్తుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో సీపీవో ఇస్మాయిల్, డీపీవో రంగాచారి, డీఐఈవో శ్రీనివాస్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులను ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవీ విరమణ ఉద్యోగానికే కాని మనస్సుకు కాదని తెలిపారు. తమ శేష జీవితం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రో హిత్ సింగ్, పింకేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యం

జనగామ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేయాలని డీసీసీ అధ్యక్షులు, జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవలంభించిన ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రజాస్వామిక హక్కుల కోసం పోరాడుతున్న చామల కిరణ్ కుమార్‌రెడ్డికి భువనగిరి ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం అవకాశం ఇచ్చిందన్నారు. పార్టీ శ్రేణులు అకుంఠిత దీక్షతో పని చేసి ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కుమార్‌రెడ్డి భారీ మెజార్టీ సాధించే దిశగా పని చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరికలు

డీసీసీ నాయకులు కొమ్మూరి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఎల్లంల గ్రామానికి చెందిన జనగామ వీరేందర్‌రెడ్డి, పెదరామన్‌చర్ల మాజీ సర్పంచ్ వల్లాల మల్లేశం, బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మల్లవరపు అరవింద్‌రెడ్డి, ఎండి రహీం, వార్డు సభ్యులు పల్లె వెంకటేష్, పల్లె సురేష్, బుర్ర రాజశేఖర్, కలకుంట్ల శ్యాం, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బండ లక్ష్మీవెంకటేశం కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వంగాళ కల్యాణి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

హోరాహోరీగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

- అధ్యక్షుడిగా వై.చంద్రరుషి ఎన్నిక



అధ్యక్షుడు చంద్రరుషి



జనరల్ సెక్రటరీగా సిద్దులు



ఉపాధ్యక్షుడు బాలకృష్ణ

జనగామ రూరల్: గత 15 రోజుల నుంచి ఉత్కంఠగా ఎదురుచూస్తున్న బార్ అసోషియేషన్ ఎన్నికలు గురువారంతో ముగిశాయి. గురువారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా వై.చంద్ర రుషి 79 ఓట్లతో గెలుపొందారు. జనరల్ సెక్రటరీగా ఎస్. సిద్దులు, ఉపాధ్యక్షుడిగా ఎస్.బాలకృష్ణ విజయం సాధించారు. ఈ ఎన్నికలకు చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్‌గా శ్రీరాం, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌లుగా పాలకుర్తి రామకృష్ణ, ఆకుల శ్రీనివాస్ వ్యవహించారు. మొత్తంగా 118 ఓట్లు ఉండగా 113 ఓట్లు పోలయ్యాయి. తనకు ఓటు వేసి గెలిపించిన ప్రతిఒక్కరికీ వారు కృతజ్ఞత తెలిపారు. బార్ అసోషియేషన్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పనిచేస్తామని వారు తెలిపారు.

పోలైన ఓట్ల వివరాలు..

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడు వై.చంద్ర రుషికి 79 ఓట్లు పడగా ప్రత్యర్థి డి.హరిప్రసాద్‌కు 34 పోలయ్యాయి. ఉపాధ్యక్షుడు ఆర్ బాలకృష్ణకు 77, ప్రత్యర్థి రాంరెడ్డికి 33 ఓట్లు, జనరల్ సెక్రటరీ ఎస్ సిద్దులు 52 ఓట్లు పడ్డాయి. ప్రత్యర్థులు టి.రాజయ్యకు 26 ఓట్లు, ఎస్ రేణుకకు 33 ఓట్లు వచ్చాయి. అంతకు ముందే జాయింట్ సెక్రటరీగా సత్తయ్య, కోశాధికారిగా చంద్రశేఖర్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీగా పి.మురళి, కార్యవర్గ సభ్యులుగా జ్యోత్స్న, దాసు, ఉదయ్. రవికుమార్, ఎన్నికయ్యారు.

కొనుగోళ్లు ఎలా?

యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై చాలాచోట్ల రాని స్పష్టత

- 1,078 కొనుగోలు కేంద్రాలు.. 15.42 లక్షల మె.టన్నుల సేకరణ
- ఉమ్మడి వరంగల్‌లో అధికారుల ప్రతిపాదనలు
- గతేడాది యాసంగితో పోలిస్తే 54 శాతం అధికం
- ఇంకా తెరుచుకోని కేంద్రాలు.. కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లతో సీఎస్ కాన్ఫరెన్స్
- జిల్లాల వారీగా క్షేత్రస్థాయి పర్యటనలు..

సాక్షిప్రతినిధి, వరంగల్:

యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. వరికోతలు మొదలవుతున్న తరుణంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ఈ విషయంలో జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు ప్రత్యేక చొరవ చూపాలి. క్షేత్రస్థాయిలో ఆలస్యం జరగకుండా చూడాలి.

- కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఈ యాసంగిలో ధాన్యం దిగుబడి దండిగా రాబోతుందని అధికారులు అంచనాకు వచ్చారు. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా కొనుగోలు ప్రణాళిక తయారు చేసి ఫిబ్రవరి నెలాఖరులో ప్రభుత్వానికి పంపారు. ఈ మేరకు ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వంనుంచి గ్రీన్‌సిగ్నల్ రాగా.. ఏర్పాట్లపై కసరత్తు జరుగుతోంది. రెండు రోజుల క్రితం ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి ఆరు జిల్లాల కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై సమీక్షించారు. తక్షణమే కేంద్రాలను తెరిచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో కేంద్రాల ఏర్పాటుపై స్పష్టత రాకపోవడంతో యాసంగి కొనుగోళ్ల ఎలా? ఎప్పటినుంచి? అన్న చర్చ జరుగుతోంది.

గతేడాది యాసంగితో పోలిస్తే 54 శాతం అధికం...

ఎప్పుడైనా గతేడాది యాసంగి కొనుగోళ్లకు 10–15 శాతం అధికంగా ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలశాఖలు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తాయి. కానీ, ఈసారి గతేడాదికంటే 54 శాతం అధికంగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022–23 యాసంగిలో 1,058 కొనుగోలు కేంద్రాలను ఉమ్మడి వరంగల్‌లో ప్రారంభించి 7,09,318.44 మెట్రిక్ టన్నుల ధాన్యం ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ తదిదర సంస్థల ద్వారా కొనుగోలు చేశారు. ఈ ఏడాది గతంతో పోలిస్తే 40 శాతంగా వరి సాగైనట్లు అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. 9,18,337.59 ఎకరాల్లో వరి వేయగా.. 15,42,468.47 మె.టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. దీనిని కొనుగోలు చేసేందుకు ఆరు జిల్లాల్లో 1,078 కేంద్రాలను ప్రతిపాదించారు. ఇప్పటికే గత యాసంగిలో ఇప్పటికే 40 శాతంకు పైగా కేంద్రాలను తెరిచిన అధికారులు ఈసారి ఇప్పటికీ 164 చోట్ల సన్నద్ధం చేసినట్లు ప్రకటించారు.



పకడ్బందీగా కొనుగోళ్ల ప్రక్రియ

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన జరగకుండా కొనుగోళ్లు జరిపేలా ఏప్రిల్ 1వ తేదీలోగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. కొనుగోలు ప్రక్రియపై ఆయా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ, తూనికలు కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించాం. జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

– భవేష్ మిశ్రా, జిల్లా కలెక్టర్, జేఎస్ భూపాలపల్లి

రబీ 2022-23			రబీ 2023-24 ప్రతిపాదనలు		
జిల్లా	తెరిచిన కొనుగోలు కేంద్రాలు	కొనుగోలు చేసిన ధాన్యం	వరిసాగు (ఎకరాల్లో)	వరిరాబడి అంచనా (మె.టన్నులు)	ప్రతిపాదించిన కొనుగోలు కేంద్రాలు
హనుమకొండ	150	1.30,935	1,18,061.06	3,16,231.57	150
వరంగల్	193	1,46,091.92	1,10,705.40	2,55,429.18	208
భూపాలపల్లి	188	1,11,363.76	80,785.29	2,09,976.35	189
మహబూబాబాద్	192	1,12,043.48	1,28,516.57	2,52,766.60	192
జనగామ	195	1,40,993.08	4,33,289.87	4,03,289.30	195
ములుగు	140	67,891.20	46,979.40	1,04,775.47	144

డీఎస్పీ జిల్లా కమిటీ ఎన్నిక

జనగామ రూరల్: ధర్మసమాజ్ పార్టీ(డీఎస్పీ) జిల్లా కమిటీని గురువారం పట్టణంలోని అంబేద్కర్ పూలే అధ్యయన వేదికలో ఎన్నుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మేకల సుమన్ ఆధ్వర్యంలో జిల్లాలో తొలుత సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొల్లపల్లి చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా సందీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పవన్ కల్యాణ్, రవి, కోశాధికారి కిట్టయ్య, కార్యదర్శులుగా బాబు, ఉమా తదితరులను ఎన్నుకున్నారు.

మంత్రి సీతక్కకు వినతి

దేవరుప్పుల : మండలంలో కాంగ్రెస్ నూతన కమిటీ మార్పు తీరుపై మంత్రి ధనసరి సీతక్కకు పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి వినతిపత్రం అందజేశారు. గురువారం ములుగులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి ఇటీవల మండల అధ్యక్షుడిగా పార్టీ నియామవళికి విరుద్ధంగా, అకారణంగా తొలగించిన తీరుపై వివరించి తగు న్యాయం చేయాలని కోరినట్టు తెలిపారు.

డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

స్టేషన్‌ఘన్‌పూర్: నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న డివిజన్ కేంద్రంలోని విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం అన్నారు. డివిజన్ కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాజ్యోతి డిగ్రీ కళాశాలలో యూజీసీ, కాకతీయ యూనివర్సిటీ నియమ నిబంధనలను పాటించడం లేదన్నారు. విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అదే విధంగా కళాశాలలో ప్రస్తుతం ఫాదర్ కొలంబో ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నారని, ఒకే భవనంలో రెండు సంస్థలు ఎలా నడిపిస్తారన్నారు. విద్యాశాఖ హక్కు చట్టం నిబంధనల్ని ఉల్లంఘిస్తూ విద్యాశాఖ అధికారులతో కుమ్మక్కై పేరెంట్స్‌ను మోసం చేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్‌ఎఫ్‌ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చరణ్, కార్యదర్శిగా హరీశ్, ఉపాధ్యక్షులుగా రోహిత్, మహేందర్, సహాయ కార్యదర్శులు సంగీత, శృతి, రష్మిత, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్, ప్రణయ్, ప్రవళిక, సాగర్, విష్ణు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, సహాయ కార్యదర్శి యాకన్న, జిల్లా కమిటీ సభ్యుడు ఆర్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మబిక్షం

క్లుప్తంగా

వనదేవతల కానుకల లెక్కింపు


కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క, సారలమ్మ హుండీల్లోని కానుకలను గురువారం లెక్కించారు. మేడారం ఎండోమెంట్ డార్మెటరీ హాల్‌లో పూజారుల సమక్షంలో దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కానుకలు లెక్కించారు. 10 హుండీల కానుకల ద్వారా రూ.43,12,977 ఆదాయం వచ్చినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు. సమ్మక్క హుండీ ఆదాయం రూ. 22,36,564, సారలమ్మ హుండీ రూ. 18,67,016, గోవిందరాజు హుండీ రూ.1,17,761, పగిడిద్దరాజు హుండీ ఆదాయం రూ. 91,636 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ నగదును తాడ్వాయి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్‌లో జమ చేసినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో పూజారులు సిద్దబోయిన మునీందర్, చంద రఘుపతిరావు, కొక్కెర క్రిష్ణయ్య, కాక కిరణ్, సిద్ద బోయిన అరుణ్, ఎండోమెంట్ సూపరిటెండెంట్ క్రాంతికుమార్, జూనియర్ అసిస్టెంట్లు జగదీశ్వర్, మధు, రమాదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో జేఏ ఆత్మహత్య


రావుల రవి(ఫైల్)

కాశిబుగ్గ: ఆర్థిక ఇబ్బందులతో జూనియర్ అసిస్టెంట్(జేఏ) రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వరంగల్, చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ధర్మారం వద్ద చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రావుల రవి(57) జనగామ పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. రవికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్లు చేయడంతో అప్పుల పాలయ్యాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చి గురువారం రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ సుదర్శన్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుమారుడు కేశవ వర్మకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

మూణ్నాళ్ల ముచ్చటే!

చిన్నతనంలోనే ప్రేమ వివాహాలు.. కొన్నాళ్లకే ఎడబాటు

- పీఎస్‌లలో నిత్యం ప్రేమ పెళ్లిళ్ల పంచాయితీలు
- యువత పెడదారి.. దుఃఖసాగరంలో తల్లిదండ్రులు



కాజీపేట : వారిద్దరూ మైనర్లు.. ఓ కళాశాలలో పరిచయమవుతారు. పరిచయం కాస్త ప్రేమగా మారుతుంది. పెద్దలకు ఇష్టం లేకపోయినా బయటకు వెళ్లి వివాహం చేసుకుంటారు. ఆపై వివాహ బంధంలో సంతానం జన్మించిన తరువాత ఇక అక్కడి నుంచి ఇద్దరి మధ్య విభేదాలు ప్రారంభమవుతాయి. ఆ విభేదాలు కాస్త విడిపోయే వరకు వస్తాయి. ఇదంతా 2000 సంవత్సరంలో తేజ దర్శకత్వంలో వచ్చిన 'చిత్రం' సినిమాలోని సన్నివేశం. ఆ చిత్రంలో చూపించిన విధంగానే ప్రస్తుత సమాజంలోని యువత కూడా పయనిస్తోంది. మైనార్టీ తీరని వయసులోనే ప్రేమ అనే బంధానికి ఆకర్షితులై ఇబ్బందులకు గురవుతున్నారు. ఫలితంగా బంగారు భవిష్యత్‌ను చేజేతుల నాశనం చేసుకుంటున్నారు.

పోలీసులను ఇబ్బందులకు గురి చేస్తున్న కేసులు..

ప్రస్తుత సమాజంలో ప్రేమ వివాహాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. అయితే ప్రేమకు ఎంత త్వరగా ఆకర్షితులవుతున్నారో అంతే త్వరగా విభేదాలు ప్రారంభమై విడిపోతున్నారు. ఒక కాజీపేట పట్టణంలోనే నెలలో 10 నుంచి12కు పైగా జంటలు పోలీసుస్టేషన్‌కు చేరుతున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో నిత్యం ఎన్ని కేసులు నమోదవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. తమ గారాల కూతుళ్లు కనిపించకపోతే చాలు.. ఆతృత పడే తల్లిదండ్రులు వెంటనే పోలీసు స్టేషన్ల బాట పడుతున్నారు. దీంతో పోలీసులు కేసులు నమోదు చేసుకోవడం.. ఆ జంటల కోసం వెతికి పీఎస్‌కు తీసుకొచ్చే క్రమంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధికారులు వాపోతున్నారు. వివిధ కారణాలతో కేసు విచారణలో కొద్దిగా జాప్యం జరిగిన పోలీసులపైనే ఆరోపణలు వెల్లువెత్తుతుంటాయి. తీరా వచ్చాక ఆ యువకుడిపై ఉన్న వ్యామోహం తీరాక తల్లిదండ్రుల మాటలు వినకపోవడం.. కొద్దిరోజుల్లోనే ప్రేమ అనే భ్రమ తొలగిపోయి ఇండ్లకు తిరిగి రావడం చేస్తున్నారు. ఇంట్లో వాళ్ల ఆదరించరనే భయం ఉన్న వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



- అమ్మాయి కొద్దిగా చనువుగా మాట్లాడితే చాలు దీనినే ప్రేమగా అర్థం చేసుకుని చదువుపై దృష్టి తగ్గిస్తున్నారు. ఒకవేళ వారు ప్రేమకు అంగీకరిస్తే పర్వాలేదు. లేదా ఏదో ఒక అఘాయిత్యం చేసుకోవడానికి కూడా యువత వెనుకాడడం లేదు. ఇంట్లో చెప్పకుండా వివాహం చేసుకుని కొన్నాళ్లకు తిరిగి రావడం పరిపాటిగా మారింది. వచ్చిన వారు మైనర్లు అయితే పోలీసులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే కొంతమంది మాత్రమే దూరం కావడానికి ఒప్పుకుంటుండగా.. మరికొంతమంది తాము విడిపోయేది లేదంటూ ఖరాఖండిగా చెబుతుండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అయితే ఇదంతా బాగానే ఉన్నా ప్రేమ వివాహం చేసుకున్న వారు సంతాన అనంతరం విభేదాలు ప్రారంభమై ఎంతో మంది విడిపోతున్న ఘటనలు కనిపిస్తున్నాయి. ఆ సమయంలో మళ్లీ వారు పోలీసుస్టేషన్ లేదా కోర్టు మెట్లు ఎక్కక తప్పడం లేదు. ఇలా యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.
- కాజీపేటకు చెందిన ఓ విద్యార్థిని హనుమకొండలోని ఓ కళాశాలలో చదువుతుండగా మడికొండకు చెందిన యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగదీసుకుని వివాహం చేసుకున్నాడు. ఈ ఘటన స్థానిక పోలీసుస్టేషన్‌కు వచ్చింది. అయితే అక్కడ తల్లిదండ్రులు ఎంత నచ్చచెప్పినా ఆ అమ్మాయి వినకపోవడంతో చివరకు వారు తమకు కుమార్తె జన్మించలేదంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రేమ వివాహం కొంత కాలం సాజావుగా సాగినా కుటుంబంలో కలహాలు ప్రారంభం కావడంతో ఆ యువతి మళ్లీ తల్లిదండ్రుల చెంతకు చేరింది.
- కాజీపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన యువకుడిని మూడు నెలల కింద అదే ప్రాంతంలో ఉన్న యువతి ప్రేమ వివాహం చేసుకుంది. అయితే తల్లిదండ్రులు ఎంత నచ్చ చెప్పినా ఆ యువకుడే కావాలంటూ పట్టుబట్టింది. ఈ విషయంపై కాజీపేట పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ యువతిని ఎలా పోషిస్తావని సదరు యువకుడిని పోలీసులు ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేకపోయాడు. అయితే వారిద్దరి మధ్య కలహాలు నెలకొనడంతో పోలీసుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.
- ఇటీవల దర్గాకాజీపేట ప్రాంతానికి చెందిన ఓ మహిళ తాను చదువుతున్న కళాశాలలో యువకుడిని ప్రేమించింది. అయితే అది పెద్దలకు ఇష్టంలేకపోవడంతో వేరే యువకుడికిచ్చి పెద్దలు వివాహం చేశారు. కొద్దిరోజులు ఆ యువకుడితో ఉన్నప్పటికీ ఆమె ప్రేమించిన వ్యక్తిని మరచిపోలేక అతడి వద్దకు వెళ్లిపోయింది. కాని కొన్నాళ్లకు ప్రేమికుడితో విభేదాలు రావడంతో మళ్లీ తల్లిదండ్రుల చెంతకే చేరింది.

అవగాహన లేకే యువత పెడదారి..



ప్రస్తుత సమాజంలో యువత ఎవరి మాట లెక్క చేయడం లేదు. దీంతో భవిష్యత్ బుగ్గిపాలవుతోంది. పిల్లలను సన్మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు ఎంతో కష్ట పడుతున్నా వారు మాత్రం అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రేమ పెళ్లిళ్లు చేసుకుని కొన్నాళ్లకే వాటిని తెగతెంపులు చేసుకునే పరిస్థితులే ఎక్కువ కనిపిస్తున్నాయి. పిల్లలు తల్లిదండ్రుల మాటకు విలువనిచ్చి వారు చూసిన వివాహాలే చేసుకోవడం ఉత్తమం.

-వై.సుధాకర్ రెడ్డి, సీఐ, కాజీపేట

ఆలస్యం.. అలక్ష్యం


మంటల్లో కాలిపోతున్న జకోటియా కాంప్లెక్స్. ఇన్‌సెట్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జకోటియా కాంప్లెక్స్‌లోని రెండు అంతస్తుల్లో అగ్నిప్రమాదం

- మంటలు ఆర్పడంలో జాప్యం
- నెమ్మదిగా వచ్చిన ఫైరింజన్లు
- నీరు లేక ఇబ్బందులు
- మున్సిపాలిటీ ట్యాంకర్లే దిక్కు

వరంగల్: వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ సమీపంలోని జకోటియా కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కాంప్లెక్స్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తులు ఉన్నాయి. దీనిలో రెండో అంతస్తులో ఉన్న ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయంలో సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ వల్ల పొగలు వచ్చాయి. ఆతర్వాత పెద్ద శబ్దం రావడంతో పాటు చిన్నగా మంటలు చెలరేగాయి. భయాందోళనకు గురైన సిబ్బంది వెంటనే వరంగల్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించినట్లు తెలిసింది. సమాచారం అందించిప్పటికీ కూతవేటు దూరంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్లు ఘటనా స్థలానికి అరగంట తర్వాత వచ్చినట్లు కాంప్లెక్స్‌లోని వ్యాపారులు తెలిపారు. ఫైరింజన్ రావడం ఆలస్యం కావడంతో మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. వచ్చినా వారి వద్ద సరైన ప్లానింగ్ లేక పోవడంతో మంటలు అదుపులోకి తీసుకురాలేక పోయారు. దీంతో కింది అంతస్తు నుంచి పై అంతస్తులోని మినీ ఫంక్షన్ హాళ్లకు వ్యాపించడంతో మొత్తం భవనమంతా భయంకరంగా మంటలు వ్యాపించాయి. గంట తర్వాత మరో రెండు ఫైరింజన్లు వచ్చినప్పటికీ కింది నుంచే నీటిని స్ప్రే చేయడంతో మంటలు అదుపులోకి రాలేదు. కింది నుంచి పై రెండు అంతస్తులు సుమారు 30 ఫీట్ల ఎత్తు ఉండడం వల్ల ఫైరింజన్లతో స్ప్రే చేసినప్పటికీ.. నీరు భవనం చివరి మంటల్ని మాత్రమే ఆపింది. లోపలివైపు మంటలు చెలరేగడంతో లోపల ఉన్న వస్తువులు, ఫర్నిచర్, ఏసీ మిషన్లు కాలి బూడిదయ్యాయి. మంటలు చెలరేగుతున్న సమయంలో రెండు అంతస్తుల్లో ఉన్న కార్యాలయం, ఫంక్షన్ హాల్‌లోని ఏసీ మిషన్లకు చెందిన కంప్రెషర్లు పెద్ద ఎత్తున శబ్దం చేస్తూ పేలి పోవడంతో సమీపంలో ఉన్న నివాసితులు ఆందోళనకు గురయ్యారు. దీంతో పోలీసులు భవనంతో పాటు పక్కనే ఉన్న ప్రాంతంలో విద్యుత్ నిలిపివేసి ట్రాఫిక్‌ను అదుపు చేశారు. మంటలు రాత్రి పది గంటల వరకు అదుపులోకి వచ్చినప్పటికీ.. లోపల అక్కడక్కడా చిన్నగా మంటలు కనిపించాయి.

ల్యాడర్‌ను ఉపయోగిస్తే...

మూడు అంతస్తుల్లో మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌కు ఉన్న ల్యాడర్‌ను ఉపయోగించి డైరెక్ట్‌గా మంటలపై నీటి స్ప్రే చేస్తే మంటలు ఎప్పుడో అదుపులోకి వచ్చేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కింది నుంచి నీటిని స్ప్రే చేయడం వల్ల 50 శాతం నీరు వృథాగా పోయింది. ఫైరింజన్లలోని నీళ్లు ఖాళీ కావడం, అక్కడ నీరు అందుబాటులో లేక పోవడంతో.. నింపుకుని రావడానికి వెళ్లడంతో సమయం వృథా అయ్యింది. ఆ గ్యాప్‌లో మంటలు మళ్లీ చెలరేగాయి. చివరికి మున్సిపాలిటీ ట్యాంకర్లతో నీటిని తెప్పించి వాటి నుంచి మోటార్లతో ఫైరింజన్లకు ఎక్కించుకుని నీటితో మంటలు ఆర్పడం వల్ల మరింత ఆలస్యమయ్యింది. మున్సిపాలిటీలో ఉన్న క్రేన్ (వీధి దీపాలను బిగించే)ను తెప్పించి అందులోకి ఎక్కి డైరెక్ట్‌గా మంటలు ఆర్పాలన్న ఆలోచనలు అధికారులకు రాకపోవడం శోచనీయం.

నమాజ్.. ఆరోగ్యప్రదాయిని


వివిధ భంగిమల్లో ప్రార్థనలు

ప్రార్థనతో రోగాలు మాయం

- శరీర భాగాలకు వ్యాయామం
- సత్ప్రవర్తన, క్రమశిక్షణ, మోక్షమార్గం

కాజీపేట: రంజాన్ మాసంలో నమాజ్, ప్రార్థనలతో పాప పరిహారం, మోక్షమార్గం, అల్లాదీవెనలు అందుతాయని ముస్లింల నమ్మకం. నమాజ్ వల్ల శరీరంలోని అన్ని భాగాలు వ్యాయామం చేసినట్లే. రక్తప్రసరణ మెరుగుపడడం.. మెదడుకు చురుకుదనంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది. అంతేగాక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దేవుడి ప్రార్థనలో వ్యాయామం మేళవించి ఉంటుంది. అందుకే దైవ చింతన ఆరోగ్యానికి మేలు కలుగజేస్తుంది. రంజాన్ మాసంలో ముస్లింలు చేసే నమాజ్‌లో ఆరోగ్యానికి దోహదపడే అంశాలెన్నో ఉన్నాయని కాజీపేట జమా మసీదు ఇమామ్ షేక్ మహబూబ్ రహ్మాన్ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నమాజ్‌కు ప్రాధాన్యం...

రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ప్రార్థనలు చేస్తూ ఉపవాస దీక్షలో ఉంటారు. అల్లా దీవెనల కోసం ఐదు సార్లు నమాజ్ చేస్తారు. నమాజ్‌లో అల్లాను ప్రార్థించడమే కాదు.. సంపూర్ణ ఆరోగ్యం, క్రమ శిక్షణ అలవడుతుంది. నమాజ్ వెనుక ఉన్న అసలు పరమార్థం ఇదే. నమాజ్‌లో తక్బీర్, ఖీయాం, రుకూజల్సా, సజ్దా, సలాం, ఖయోదా అనే క్రియలుంటాయి. వీటితో ఎన్నో ఉపయోగాలున్నాయి.

తక్బీర్..

నమాజ్ ప్రారంభించే ముందు రెండు చేతులను చెవుల వరకు తీసుకెళ్లి మళ్లీ కిందకు దించి నాభిపై ఉంచుతారు. ఈ క్రియ ద్వారా చేతికి బలం చేకూరుతుంది. గుండెకు విశ్రాంతి లభిస్తుంది. రెండు చేతులను పైకెత్తి దించడం ద్వారా ఆధ్యాత్మిక చింతనతో పాటు శరీరంలో రక్తప్రసరణ క్రమపద్ధతిలో జరుగుతుంది.

ఖీయాం..

నమాజ్ చదవడానికి నిటారుగా నిలబడడాన్ని ఖీయాం అంటారు. అల్లాహ్ అక్బర్ అని తక్బీర్ ఉచ్చరిస్తూనే కుడిచేతి బొటన, చిటికెన వేళ్లతో ఎడమచేతి మణికట్టును నాభిపై ఉంచుతారు. దీంతో మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. రోగాలు దరిచేరవు. ముఖ్యంగా కీళ్లనొప్పులు తగ్గుతాయి.

సజ్దా..

ఈ ప్రక్రియలో పాదాలు, మోకాళ్లు, అరచేతులు, నుదురు నేలను తాకుతాయి. అల్లాహ్ ఎదుట సాష్టాంగ ప్రమాణం చేయడమే దీని ముఖ్య ఉద్దేశం. దీంతో శరీరంలోని అన్ని అవయవాలకు రక్తప్రసరణ సమపాళ్లలో జరుగుతుంది. మెదడుకు చురుకుదనం వస్తుంది. అల్సర్‌తో బాధపడేవారికి మంచిది. తొడభాగంలోని కొవ్వు కరుగుతుంది.

రుకూజల్సా..

ఈ క్రియ ద్వారా శరీరంలోని కొలెస్ట్రాల్ మాయమవుతుంది. ఉదరభాగానికి వ్యాయామం కలుగుతుంది. గుండె, మెదడు సమాంతరంగా ఉండడంతో జీర్ణాశయం పనితీరు మెరుగవుతుంది. బొటనవేళ్ల మధ్య నరాలు ఉత్తేజమవుతాయి. దీంతో వెన్నముఖ నొప్పులు మాయమవుతాయి.

ఖయోదా..

రెండు పాదాలు వెనుకకు మడచి మోకాళ్లపై కూర్చోవడం. ఇది వజ్రాసన భంగిమ. అజీర్తిని దూరం చేయడంతో పాటు ఎముకలు, కీళ్లకు శక్తినిస్తుంది.

సలాం..

నమాజ్‌లో ఇది చివరి ఘట్టం. తలను ఒక దఫా కుడివైపునకు తిప్పి మరోమారు ఎడమ వైపునకు తిప్పడం ద్వారా సలాం ఆచరిస్తారు. నమాజ్‌ను ఆచరించే సమయంలో భుజాలపై దైవ దూతలు ఉండి భక్తులు చేస్తున్న మంచి చెడులను గమనిస్తుంటారు. ఇది మెదడుకు లాభం ఇవ్వడంతో పాటు నేత్ర శక్తిని పెంపొందిస్తుంది.

రక్తసిక్త రహదారులు..


నాగేష్ (ఫైల్)


అరుణజ్యోతి (ఫైల్)


గూడూరు : తీవ్రంగా గాయపడిన అశోక్


తాడ్వాయి: కృష్ణారావు మృతదేహం

రహదారులు రక్తసిక్తమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం సింగి తండాలో ఒకరు, ఇదే జిల్లా గూడూరు మండలం మచ్చర్ల బస్టాప్ వద్ద ఒకరు, జనగామ జిల్లా నర్మెట మండలం గుంటూరుపల్లి స్టేజీ సమీపంలో ఒకరు, ములుగు జిల్లా తాడ్వాయిలో ఒకరు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

దంతాలపల్లి: అతివేగం.. ఓ ప్రాణాన్ని బలితీసుకుంది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం శివారు సింగి తండా దారిలో చెరువు కట్టపై బొలెరో అతి వేగంతో వెళ్తూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్ నూనవత్ నాగేష్(21) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. సింగి తండాకు చెందిన నూనవత్ లక్ష్మి, రాములు దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నాగేష్ హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం తన చిన్నాన్న భాస్‌సింగ్ పెద్ద ఖర్మకు హాజరయ్యాడు. ఈ క్రమంలో తన సన్నిహితుడు గుగులోత్ అంజి సోదరుడి కుమారుడి పుట్టిన రోజు వేడుకకు తన స్నేహితులు నూనవత్ వెంకటేష్, సాయికుమార్, నూనవత్ రాజేష్‌తో కలిసి బొలెరోలో మరిపెడ మండలం ఎల్లంపేట తండాలోని బంధువుల ఇంటికి వెళ్లి వారి ఆహ్వానించారు. తిరుగు ప్రయాణంలో దంతాలపల్లి మండల కేంద్రంలో మద్యం సేవించారు. మత్తులో వాహనం అతివేగంగా నడుపుతున్నారు. ఈ క్రమంలో సింగి తండా దారిలోని చెరువు కట్టపై నుంచి వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వాహనం రెండుగా విడిపోయి ట్రాలీ కింద గుగులోత్ అంజి, నూనవత్ రాజేష్, నూనవత్ వెంకటేష్, నూనవత్ సాయికుమార్ చిక్కుకుపోయారు. డ్రైవింగ్ చేస్తున్న నాగేష్ క్యాబిన్ నుంచి ఎగిరిపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తండా వాసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాలీ కింద చిక్కుకున్న నలుగురిని బయటకు తీశారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై కరుణాకర్.. క్షతగాత్రులను 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మచ్చర్ల బస్టాప్ వద్ద ఒకరు..

గూడూరు : మండలంలోని మచ్చర్ల బస్టాప్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన అశోక్, శివకుమార్(40) ద్విచక్రవాహనాలపై మానుకోట నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. ఈ క్రమంలో మచ్చర్ల బస్టాప్ వద్ద ఎదురుగా వస్తున్న ట్యాంకర్.. రెండు ద్విచక్రవాహనాలను ఢీకొని వారిపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా అశోక్‌కు తీవ్ర గాయాలుకాగా అతడి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో అంబులెన్స్‌లో వరంగల్‌కు తరలించినట్లు తెలిపారు.

గుంటూరుపల్లిలో కేజీబీవీ టీచర్..

తరిగొప్పుల, నర్మెట: రోడ్డు ప్రమాదంలో ఓ కేజీబీవీ ఉపాధ్యాయురాలు మృతిచెందింది. ఈ ఘటన గురువారం జనగామ జిల్లా నర్మెట మండలంలో జరిగింది. కుటుంబీకుల కథనం ప్రకారం తరిగొప్పుల మండలకేంద్రంలోని కస్తూర్బాలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జన్ను అరుణ జ్యోతి (37) రోజుమాదిరిగానే తన భర్తతోకలిసి ద్విచక్ర వాహనంపై గురువారం జనగామ నుంచి పాఠశాలకు బయలుదేరింది. ఈ క్రమంలో నర్మెట మండలం గుంటూరుపల్లి స్టేజీ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కింద పడింది. దీంతో అరుణకు తీవ్ర గాయాలు కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లింది. చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కాగా, మృతురాలికి 11 నెలల చిన్నారి ఉంది.

పెద్దమోరీ సమీపంలో యువకుడు..

ఎస్ఎస్ తాడ్వాయి: తాడ్వాయి సమీపం పెద్దమోరీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏటూరునాగారం మండలం ముల్లకట్ట రాంపూర్‌కు చెందిన తోలెం కృష్ణారావు (28) మృతి చెందారు. రాంపూర్‌కు చెందిన తోలెం కృష్ణారావు, మహేష్ పెళ్లి కార్డులు పంపిణీ చేసేందుకు బైక్‌పై మేడారం వచ్చారు. తిరుగు ప్రయాణంలో తాడ్వాయి సమీపం పెద్దమోరీ వద్ద గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొనడంతో కృష్ణారావు మృతి చెందాడు. మహేశ్ తీవ్రంగా గాయపడగా 108లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో కేసముద్రం వాసి ...


సూరయ్య(ఫైల్)

కేసముద్రం: హైదరాబాద్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసముద్రం మండలం ధన్నసరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బందారపు సూరయ్య(60) మృతిచెందాడు. సూరయ్య ఇటీవల హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఉంటున్న తన పెద్దకుమారుడి వద్దకు వెళ్లాడు. తెల్లవారుజామున రోడ్డు వెంట వాకింగ్ చేస్తుండగా మున్సిపాలిటీ వాహనం వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సూరయ్యను వెంటనే గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


లాలు మృతదేహం

గూడూరు : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మండలంలోని మదనాపురం శివారు దూప తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన మాలోత్ లాలు (50) వ్యవసాయ బావివద్ద మోటార్ వైర్‌కు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో షాక్ తగిలి వ్యవసాయ బావిలో పడి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థుల నమోదు పెంపుదల చేయాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గురువారం హనుమకొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు' అనే అంశంపై నిర్వహించిన వర్క్ షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువ అవుతోందని, దీంతో సర్కార్ స్కూళ్లు ప్రమాదకర స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జిల్లాలో 337 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 13, 838 మంది విద్యార్థులు నమోదు అయ్యారని, 293 ప్రైవేటు ప్రాథమిక పాఠశాలల్లో 40,901మంది నమోదు అయ్యారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువ కావడానికి పలు కారణాలున్నాయన్నారు. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. అలాగే, ఉపాధ్యాయులకు టీచర్ ఎల్జిబులిటీ టెస్టు (టెట్) ప్రత్యేకంగా నిర్వహించాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె సోమశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు పెంపుదల చేయాలన్నారు. సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు ఎం సదాశివరెడ్డి, మేకరి దామోదర్, ప్రధాన కార్యదర్శులు పెండెం రాజు, సి సుజన్‌ప్రసాద్‌రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు అన్నాదేవి, బాధ్యులు ఎస్ జ్యోతి, ఏ రావు, మల్లిక్, కె మోజెస్, సీహెచ్ లింగారావు, కె సదానందం, కె రమేష్, కె రవీందర్, బి వెంకటేశ్వర్‌రావు, గుండు కరుణాకర్, సత్యనారాయణ, ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన తనయుడి అరెస్ట్

డోర్నకల్: మండలంలోని జోగ్యాతండాలో ఫిబ్రవరి 6న తండ్రిపై దాడి చేసి అతడి మృతికి కారణమైన కుమారుడిని డోర్నకల్ పోలీసులు అరెస్ట్ చేశారు. డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు కథనం ప్రకారం తండాకు చెందిన ఆంగోత్ సేవ్యా(45)కు మానసికస్థితి సరిగా లేదు. అలాగే, మద్యానికి బానిసయ్యాడు. దీంతో తరుచూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఫిబ్రవరి 6న మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవ పడుతూ పెద్ద కుమారుడు కుమార్‌ను దూషించాడు. దీంతో కుమార్ కర్రతో తండి సేవ్యాపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. సేవ్యా బయటకు వచ్చే క్రమంలో మెట్లపై పడి అపస్మారకస్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మద్యం మత్తులో కిందపడి గాయాలై తన తండ్రి చనిపోయాడని కుమార్ ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇటీవల పోస్టుమార్టం నివేదిక అందగా అందులో సేవ్యాకు బలమైన దెబ్బలు తగలడంతో మృతి చెందినట్లు ఉంది. దీంతో గురువారం కుమార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రూ.3. 65 లక్షల నగదు పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : ఎన్నికల నిబంధనల అమలులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఇల్లెందు రోడ్డు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శ్రీనివాస్ అనే వ్యాపారి కారులో ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.3.65 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జ్ సామ్రాజ్.. నగదును స్వాధీనం చేసుకుని టౌన్ ఎస్సై ఉపేందర్ సమక్షంలో పంచనామా నిర్వహించి ఎన్నికల అధికారులకు అప్పగించారు.